సాయుధ బలగాల కవాతు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంటలో సాయుధ బలగాల కవాతు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆచంటలో బుధవారం సాయంత్రం సాయుధ పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. ఆచంట కచేరి సెంటర్ నుంచి పురవీధుల గుండా ఈ కవాతు నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజ్‌కుమార్, కేంద్ర బలగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్పొరేషన్లు కకావికలం..!

బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ కార్పొరేషన్లు నిర్వీర్యం

ఐదేళ్లలో ఉపాధి రుణాలకు పూర్తిగా తిలోదకాలు

సంక్షేమ పథకాలకిచ్చే సొమ్ము సామాజిక తరగతుల వారీగా ప్రభుత్వం లెక్క

కార్పొరేషన్ల రుణాలతో గతంలో ఎంతోమందికి జీవనోపాధి

ఎన్నికల తరుణంలో కార్పొరేషన్ల పనితీరుపై తీవ్ర చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వెనుబడిన తరగతులకు అండగా నిలవాల్సిన కార్పొరేషన్లు నిర్వీర్యమైపోయాయనే ఆవేదన అందరిలోనూ వ్యక్తమవుతోంది. గడిచిన ఐదేళ్లలో కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే ఉపాధి రుణాలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు తీరని నష్టం జరిగింది. సంక్షేమ పథకాల సొమ్మునే సామాజిక తరగతులవారీగా ప్రభుత్వం లెక్కలు చెప్పడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 40 లక్షల జనాభా ఉన్నారు. వీరిలో బిసి జనాభా దాదాపు 37 శాతం వరకూ ఉండగా, ఎస్‌సి జనాభా 20.6 శాతం, ఎస్‌టి జనాభా 2.8 శాతం, ముస్లిం 2.19, క్రిస్టియన్ జనాభా 2.77 శాతం ఉన్నారు. గత ప్రభుత్వాల పాలనలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ కార్పొరేషన్ల నుంచి ఆయా తరగతుల ప్రజలకు పెద్దఎత్తున ఉపాధి రుణాలు అందించేవారు. రూ.రెండు లక్షల రుణం అందిస్తే రూ.లక్ష సబ్సిడీని ప్రభుత్వం ఇచ్చేది. రూ.లక్ష రుణం ఇస్తే రూ.50 వేలు సబ్సిడీ వర్తించేది. రుణం తీసుకున్న లబ్ధిదారులు కచ్చితంగా ఏదోక ఉపాధి పొందుతున్నట్లు చూపించాల్సి ఉండేది. కిరాణా దుకాణాలు, పాడి పరిశ్రమ, వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు చేసుకుని కార్పొరేషన్ల రుణాలతో ఎన్నో కుటుంబాలు ఉపాధి పొందేవి. ఇవికాకుండా రూ.20 లక్షల ఖరీదు చేసే కార్లను సైతం కార్పొరేషన్ల ద్వారా అందించేవారు. బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చేవారు. కారు నడుపుకుంటూ ప్రతినెలా బ్యాంకులకు వాయిదాలు చెల్లిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. కార్పొరేషన్ల రుణ వితరణలో ప్రత్యేక విభాగం నిరంతరం పనిచేసేది. గడిచిన టిడిపి ప్రభుత్వ హయాంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు కార్పొరేషన్ల ద్వారా పెద్దఎత్తున రుణాలు మంజూరు చేసిన ప రిస్థితి ఉంది. అప్పట్లో కార్పొరేషన్ల ద్వారా కార్లు పొంది ఇప్పటికీ ఉపాధి పొందుతున్న కుటుంబాలు ఉన్నాయి. అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఇదే ఒరవడి కొనసాగింది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్పొరేషన్ల పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 56 కార్పొరేషన్లుగా విస్తరించి ఛైర్మన్లను ప్రకటించినప్పటికీ జనానికి ఉపయోగపడని పరిస్థితి ఉంది. గడిచిన ఐదేళ్లలో కార్పొరేషన్ల ద్వారా ఏఒక్క కుటుంబానికీ ఉపాధి లభించని పరిస్థితి ఏర్పడింది. దీంతో జిల్లాలో 60 శాతానికిపైగా ఉన్న వెనుకబడిన సామాజిక తరగతుల ప్రజానీకానికి స్వయం ఉపాధి అవకాశాలు పూర్తిగా కనుమరుగయ్యాయి. అందరికీ అందించే అమ్మఒడి, చేయూత, పెన్షన్లు వంటి పథకాల సొమ్మును ఆయా సామాజిక తరగతులకు ఖర్చు చేసినట్లు ప్రభుత్వం లెక్కలు చూపించడంపై అంతా మండిపడుతున్నారు. సంక్షేమ పథకాలకు ఇచ్చిన సొమ్ముకు, కార్పొరేషన్ల రుణాలకు ఏవిధంగా పోలిక పెడతారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్పొరేషన్ల ద్వారా రుణాలందిస్తే చదువుకున్న ఎంతోమందికి ఉపాధి లభించి జీవితంలో నిలదొక్కుకునే వారమని, అటువంటి పరిస్థితి లేకుండా పోయిందని అంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాలేవీ ఈ విధంగా చేయలేదనే చర్చ నడుస్తోంది. ఎన్నికల తరుణంలో వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ల అంశం చర్చనీయాంశంగా మారింది. స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే కార్పొరేషన్లను నిర్వీర్యం చేయడంతో వెనుకబడిన తరగతుల ప్రజానీకానికి తీవ్ర నష్టం జరిగిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

జిల్లాలో 1461 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

140 మంది సెక్టార్ అధికారుల నియామకం

కలెక్టర్ సుమిత్‌కుమార్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 1461 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ తెలిపారు. 140 మందిని సెక్టార్ అధికారులుగా నియమించామని, ఎన్నికల విధుల్లో వీరంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో బుధవారం నరసాపురం, పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల సెక్టార్ అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యాన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెక్టార్ పరిధిలో ఏదైనా సమస్య ఉంటే వెంటనే రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సెక్టార్ అధికారికి పోలింగ్‌కు వారం రోజులు ముందు మేజిస్ట్రేట్ అధికారాలు ఇస్తారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో మమేకమై సమాచారం సేకరించి పోలింగ్ స్టేషన్లను మ్యాపింగ్ చేయాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం 5.30 గంటల తర్వాత మాక్ పోలింగ్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఆ సమయానికి ఒక్క ఏజెంట్ వచ్చినా 15 నిమిషాలు వేసి చూసి మాక్ పోలింగ్ ప్రారంభించాలన్నారు. ఏజెంట్లు ఎవరూ రాకపోతే ఉదయం 6.25 నిమిషాల వరకు వేచి చూసి ఆ తర్వాత మాక్ పోలింగ్ నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలన్నారు. మాక్ పోలింగ్ సమయంలో 50 ఓట్లను వేసి పరిశీలించాల్సి ఉందన్నారు. అలాగే బియు యూనిట్ పని చేయక మార్చిన సందర్భంలో కూడా మాక్ పోలింగ్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, ఇఆర్ఒలు, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సెక్టార్ అధికారుల బాధ్యత కీలకం: జెసి

ఉండి: ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల బాధ్యత కీలకమని, ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా అవగాహన చేసుకుని ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఉండి ఎంపిడిఒ కార్యాలయంలో ఉండి నియోజకవర్గ సెక్టార్ అధికారులు, పోలీస్ అధికారులకు జెసి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సెక్టార్ అధికారుల పరిధిలోని పోలింగ్ స్టేషన్లను ఒకటికి, రెండుసార్లు పరిశీలించుకుని ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. గత ఎన్నికల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి విషయంలో అప్రమత్తంగా మెలగాలని జెసి దిశానిర్దేశం చేశారు.

రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు

32,545 మంది రైతులకు రూ.26.72 కోట్లు

జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం


రైతులకు నమూనా చెక్కు అందిస్తున్న జాయింట్ కలెక్టర్

జిల్లాలో గతేడాది ఖరీఫ్‌లో తుపాన్ వల్ల పంట దెబ్బతిన్న 32,545 మంది వ్యవసాయ, ఉద్యాన రైతులకు రూ.26.72 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరైనట్లు జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం ఇన్‌పుట్ సబ్సిడీని సిఎం జగన్ బటన్ నొక్కి నేరుగా జమ చేయగా భీమవరం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కైగాల శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి సిహెచ్.శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మిచౌంగ్ తుపాను వల్ల పంట నష్టపోయిన 31,678 మంది వరి రైతులకు రూ.26.22 కోట్లు, ఉద్యాన పంటలు నష్టపోయిన 867 మంది రైతులకు రూ.50.60 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరైందన్నారు. అనంతరం రైతులకు నమూనా చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కొట్టి కుటుంబరావు, తాడేపల్లిగూడెం ఎఎంసి ఛైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, లీడ్‌బ్యాంకు మేనేజరు ఎ.నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాది పాలకొల్లులో నంది నాటకోత్సవాలు

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

ముగిసన జాతీయస్థాయి నాటిక పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో గత టిడిపి ప్రభుత్వ హయాంలో 70 శాతం పూర్తిచేసిన బొండాడ వెంకటరాజు గుప్త, ఎన్‌టిఆర్ కళాక్షేత్రాన్ని అన్ని సౌకర్యాలతో అద్భుతంగా ఈ ఏడాదిలోగా పూర్తి చేసి వచ్చే 2025లో ప్రతిష్టాత్మకమైన రాష్ట్ర ప్రభుత్వ నంది నాటకోత్సవాలను నిర్వహించేలా బాధ్యత తీసుకుంటానని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. స్థానిక అద్దేపల్లివారి సత్రం ప్రాంగణంలో మూడు రోజులుగా పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి నాటిక ఉత్సవాల ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాదులో రవీంద్రభారతి, విశాఖపట్నంలో కళాభారతిలకు మించి ఎన్‌టిఆర్ కళాక్షేత్రాన్ని అన్ని అద్భుతమైన సౌకర్యాలతో నిర్మాణ పనులు చేపట్టామని మరో నాలుగు నెలల్లో పూర్తి కావాల్సిన సమయంలో ప్రభుత్వం మారిందన్నారు. వైసిపి ఐదేళ్లలో రూపాయి పని కూడా నోచుకోలేదన్నారు. రానున్న టిడిపి, జనసేన ప్రభుత్వంలో కళాకారులందరికీ పెన్షన్ వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీ నిర్మాత బన్నీవాసు మాట్లాడుతూ కళలకు, కళాకారులకు పుట్టినిల్లు అయిన పాలకొల్లులో నాటక రంగానికి ఊపిరి పోస్తున్న పాలకొల్లు కళాపరిషత్ నిర్వాహకులను అభినందించారు. సభకు విటాకుల వెంకటరమణ అధ్యక్షత వహించారు. వేదికపై ఎఎంసి మాజీ ఛైర్మన్ ఉన్నమట్ల కపర్ది, డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ, మేడికొండ శ్రీనివాస్, కెవి.కృష్ణవర్మ, మానాపురం సత్యనారాయణ, కొల్లి ప్రసాద్, కొనిజేటి గుప్తా, జివి, పెచ్చెట్టి బాబు, కామిశెట్టి అయ్యప్పనాయుడు, నడపన శ్రీనివాసరావు, నిట్టల ఫణిభాస్కర్, వంగా నరసింహరావు, గుండా రామకృష్ణ, గుడాల హరిబాబు పాల్గొన్నారు. నాటిక పోటీల్లోని విజేతలకు బహుమతులు అందించారు.

ఉత్తమ ప్రదర్శనగా 'రాత'

పాలకొల్లులో మూడు రోజులపాటు జరిగిన 15వ జాతీయస్థాయి నాటికల పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా వెలగలేరు థియేటర్స్ ఆర్ట్స్ ప్రదర్శించిన రాత ఎంపికైంది. పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం మంగళవారం రాత్రి జరిగింది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా అభినయ పార్టీ, గుంటూరు ప్రదర్శించిన ఇంద్రప్రస్థం, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళాభారతి, కరీంనగర్ వారి స్వప్నం రాల్చిన అమృతం, జ్యూరీ అవార్డు అరవింద ఆర్ట్స్, వాడేపల్లి వారి మనస్విని ఎంపికైంది.

రైల్వే గూడ్స్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

ఘనంగా రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ 40వ వార్షికోత్సవం

మాట్లాడుతున్న కర్రి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రైల్వే గూడ్స్ షెడ్లో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, పెంటపాడు మండల కన్వీనర్ చిర్ల పుల్లారెడ్డి తెలిపారు. తాడేపల్లిగూడెం తాలూకా రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం)40వ వార్షికోత్సవం స్థానిక రైల్వే గూడ్స్ షెడ్ కార్యాలయంలో సత్తి కోదండరామిరెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. తొలుత సత్తి కోదండ రామిరెడ్డి సిఐటియు జెండా ఆవిష్కరించారు. 2023వ సంవత్సరం కార్యకలాపాల రిపోర్టును చిర్ల పుల్లారెడ్డి ప్రవేశపెట్టారు. యూనియన్ సభ్యులు రిపోర్టును ఆమోదించారు. ఈ వార్షికోత్సవాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ రైల్వే గూడ్స్ షెడ్‌లో పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, పని భద్రత కల్పించాలని, 60 సంవత్సరాలు దాటిన కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రైల్వే గూడ్స్ షెడ్ల వద్ద పనిచేస్తున్న కార్మికులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. దేశంలో అసంఘటిత రంగంలో పనిచేసే 40 కోట్ల మంది కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాడ్యూటీ, ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. బిజెపి 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించడం దుర్మార్గమన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి మద్దతు తెలిపే పార్టీలను ఓడించాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సత్తి కోదండ రామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా కర్రి సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చిర్ల పుల్లారెడ్డి, సహాయ కార్యదర్శిగా కర్రి నాగేశ్వరరావు, కోశాధికారిగా ఎస్‌విఎస్.రెడ్డి, కమిటీ సభ్యులుగా ఆకుల నారాయణ, కర్రి సుబ్బిరెడ్డి, అడపా ఆంజనేయులు, మద్దాల పుత్రయ్య, బుద్దాల నాని, అడ్డగర్ల కృష్ణ, కర్రి శ్రీనివాసరెడ్డి, గాది వెంకటరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, నరమాల కృష్ణ, మెట్రెడ్డి రమణ, కుంచంగి నానాజీ, గొర్రెల సతీష్‌కుమార్, పులిమంతుల రమణ, చల్లా చంద్రరావు పాల్గొన్నారు.

త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తా

ఎంఎల్ఎ మంతెన రామరాజు

మాట్లాడుతున్న ఎంఎల్ఎ రామరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

నియోజకవర్గంలో నేతలు అనేక సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని, అయితే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, నిధులు రాక ఆ సమస్యలను పరిష్కరించలేకపోయాయని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. బుధవారం మండలంలో పలు గ్రామాల్లో టిడిపి, జనసేన సమన్వయ సమావేశాలు నిర్వహించారు. ఐభీమవరంలో గ్రామ మాజీ సర్పంచి కనుమూరి రామకృష్ణంరాజు నివాసం వద్ద జరిగిన సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన అభ్యర్థిగా తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తనకు సమస్యలు చెప్పినా టిడిపి అధికారంలో లేకపోవడం, వైసిపి ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో పనులేమీ చేయలేకపోయానన్నారు. టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని చెప్పారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ రామరాజును అంతా కలిసికట్టుగా గెలిపించుకోవాలన్నారు.

కాలనీవాసులకు తాగునీరందించాలి

తహశీల్దార్‌కు సిపిఎం వినతి

వినతిపత్రం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఆకివీడు

కొత్తగా ఇళ్లు నిర్మించుకుంటున్న కాలనీలకు తాగునీరందించాలని సిపిఎం కోరింది. ఈ మేరకు ఆ పార్టీ నేతలు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ తాళ్లకోడులో సుమారు 1200 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకోగా 500 కుటుంబాల వరకు నివాసముంటున్నాయని తెలిపారు. వారు తాగునీరు సక్రమంగా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ కాలనీలో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు తక్షణమే అందించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహశీల్దార్ వెంకటేశ్వరి హామీ ఇచ్చారు. త్వరలోనే కచ్చా డ్రెయిన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి తవిటినాయుడు, నేతలు బొడ్డుపల్లి రాంబాబు, సందక సూరిబాబు, బివి.వర్మ, ఇజ్జాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

బిసిలకు అండగా వైసిపి ప్రభుత్వం

'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్


మాట్లాడుతున్న పివిఎల్ నర్సింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

బిసి సామాజిక తరగతులకు వైసిపి ప్రభుత్వం అండగా నిలవడంతోపాటు ముఖ్యమంత్రి జగన్ బిసిలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని ఎంఎల్‌ఎసి కవురు శ్రీనివాస్ అన్నారు. ఉండి నియోజకవర్గంలో చేపట్టిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం 200వ రోజుకు చేరింది. దీనిలో భాగంగా పెదఅమిరంలోని వైసిపి కార్యాలయం నుంచి నేతలు శృంగవృక్షం వరకూ భారీ ర్యాలీ నిర్వహించి, ఆ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ వైసిపి సంక్షేమ పథకాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ప్రతిఒక్కరూ వచ్చే ఎన్నికల్లో జగన్‌కు అండగా నిలవాలని కోరారు. డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఏకపక్షంగా ఓట్లు వేసి భారీ మెజార్టీతో వైసిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వైసిపి నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ ప్రతిఒక్క వైసిపి అభ్యర్థి గెలుపునకు మద్దతివ్వాలన్నారు. కార్యక్రమంలో పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి, ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు), సర్పంచి జంగం సూరిబాబు, ఉప సర్పంచి కలిదిండి ఆనందరాజు, శృంగవృక్షం సొసైటీ మాజీ ఛైర్మన్ వీరవల్లి లక్ష్మణరావు, వైస్ ఎంపిపిలు ఆదాడ లక్ష్మీ తులసి, నరేష్, ఉండి ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ చేకూరి నరేంద్రవర్మ, ఎంపిటిసిలు మల్లుల సూర్యకళ, పాలా జ్యోతి, బందెల మౌనిక, నాయకులు కొత్తపల్లి కాశీవిశ్వనాథరాజు, కటిక శ్రీదేవి, బొల్లా శ్రీనివాస్, సిహెచ్‌వివి.పాపారావు, దెందుకూరి వెంకటరాజు, మోగల్లు వెంకట్రాజు పాల్గొన్నారు.

విద్యార్థులు అధిక మార్కులు సాధించాలి : డిఇఒ

వీరవాసరం :త్వరలో జరగబోయే పదో తరగతి పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించేలా విద్యార్థులు ప్రత్యేక కేంద్రీకరణతో చదవాలని డిఇఒ వెంకటరణమన్నారు. బుధవారం ఆయన రాయకుదురు హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలు చేస్తున్న కార్యక్రమాలను, రికార్డులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో సమావేశమై సి, డి గ్రేడుల్లో ఉన్న విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. వారికి పలు సూచనలు చేశారు. గణితం, సైన్స్, సోషల్ సబెక్టుల్లో ఎక్కువ మార్కులు సాధించడానికి ఉపయోగపడే విషయాలపై విద్యార్థులు దృష్టి కేంద్రీకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కానుకొలను శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు వీరవల్లి నాగేశ్వరరావు, కాయల వీరాస్వామి, యువి.సుబ్బరాజు, అంగర వేణు, గజేంద్ర గట్కర్, లక్ష్మీదుర్గ, బోను దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆచంటలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట

రామేశ్వర స్వామి ఆలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌పి అజిత

శివరాత్రి ఉత్సవాలకు ఆచంట రామేశ్వరస్వామి ఆలయం ముస్తాబైంది. బుధవారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యాత్రికులతో ఆలయం కిటకిటలాడింది. తెల్లవారుజాము నాలుగు గంటలకు రామేశ్వరస్వామి కళ్యాణం సందర్భంగా ఇఒ రామచంద్రకుమార్‌స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి వి.అజిత ఆలయ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 25 మంది కానిస్టేబుళ్లు, ఇద్దరు ఎస్ఐలు, ఐదుగురు హెచ్‌సిలు, పది మంది హోంగార్డులు, పదిమంది మహిళా పోలీసులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంతోపాటు తిరునాళ్లు జరిగే ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా స్థానిక కచేరి సెంటర్ నుంచి ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మీదుగా ట్రాఫిక్ మళ్లించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ బుద్దిరాజు విద్యాసాగర్, బోర్డు సభ్యులు అడ్డాల సూర్యప్రసాద్, కాండ్రేకుల కనకేశ్వరరావు, పూసపాటి కృష్ణ, మనవర్తి సుధాకరరావు, అన్నపూర్ణ, లక్ష్మీదేవి, అనంతలక్ష్మి, ప్రసన్నలక్ష్మి, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి

శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆచంట గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పంచాయతీ కార్యదర్శి జి.నరసింహారావు తెలిపారు. ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని తాత్కాలికంగా 15 మంది అదనపు సిబ్బందితోపాటు, చెత్త సేకరణకు అదనపు ట్రాక్టర్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ట్రాక్టర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని, తాత్కాలిక మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేశామని వివరించారు.

సంతకాల ఫోర్జరీ విషయంలో అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సంతకాల ఫోర్జరీ, తప్పుడు రిజిస్ట్రేషన్ల విషయంలో విఆర్‌ఒలు అప్రమత్తంగా ఉండాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు ఒక ప్రకటనలో హెచ్చరించారు. పెనుమంట్ర మండలం భట్లమగుటూరు గ్రామంలో ఆరు సెంట్లు భూమిని సరైన డాక్యుమెంట్లు లేకుండా విఆర్‌ఒ పేరుతో ఫోర్జరీ సర్టిఫికెట్ పెట్టి, పెనుగొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుని చేసుకున్నారని పేర్కొన్నారు. ఆ స్థలంలో భవన నిర్మాణం జరుగుతుంటే స్థానికుల ఫిర్యాదు మేరకు పరిశీలిస్తే విఆర్‌ఒ సంతకం ఫోర్జరీ చేసి సర్టిఫికెట్ సృష్టించినట్లు తేలిందని తెలిపారు. దీనిపై ఆ మండల తహశీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనిపై తమ సంఘం ఆధ్వర్యాన తహశీల్దార్‌తో మాట్లాడామని, తగు చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు. జిల్లా రిజిస్ట్రార్ దృష్టికి తహశీల్దార్ ద్వారా ఈ విషయాన్ని తీసుకెళ్లి ఆ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరామని పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని యండగండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మూడో రోజు ప్రశాంతంగా జరిగాయని కళాశాల ప్రిన్సిపల్ పెద్దిరాజు తెలిపారు. తమ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ పరీక్షల్లో మ్యాథ్స్‌కు సంబంధించి 133 మంది విద్యార్థులకు 130 మంది హాజరవ్వగా ముగ్గురు గైర్హాజరయ్యారని తెలిపారు. బోటని పరీక్షకు 30 మందికి ఒకరు, సివిక్స్ 37 మందికి నలుగురు గైర్హాజరైనట్లు తెలిపారు. ఒకేషనల్ పరీక్షకు సంబంధించి 16 మందికి పూర్తిగా హాజరైనట్లు పెద్దిరాజు తెలిపారు. కళాశాల ప్రాంగణంలో 144 సెక్షన్ అమలులో ఉండటంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు, పోలీసు సిబ్బంది పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నరసాపురం : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం మ్యాథ్స్, సివిక్స్, బోటని పేపర్-1 పరీక్ష బుధవారం జరిగింది. నరసాపురంలో ఆదిత్య, శ్రీ వైఎన్ డైమండ్ జూబ్లీ, శ్రీ సూర్య, ఉమెన్స్, గౌతమి, భాష్యం కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు ఉండటంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్‌కి ఆస్కారం లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులను పూర్తిగా తనిఖీలు చేసిన తర్వాతే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తున్నారు. బిజెపిఎస్ ఉమెన్స్ కళాశాలలో 305 విద్యార్థులకు 287 మంది హాజరయ్యారు. 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - పెనుగొండ

సిద్ధాంతం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సర్పంచి చింతపల్లి చంటిని బుధవారం కలిసి ఆయనకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏళ్ల తరబడి గ్రామపంచాయతీలో పని చేస్తున్న టెండర్ కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సౌకర్యాలు అమలు కావడంలేదన్నారు. పారిశుధ్య కార్మికుల పరిస్థితి మరీ దారుణమన్నారు. టెండర్ విధానం రద్దు చేయాలని ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినా ఆలోచన చేయలేదన్నారు. దీనిపై సర్పంచి మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఆదినారాయణ, కె.శివ, పల్లి రమణ, మానుకొండ నాగమణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

లయన్ పదం కుమార్ గుప్తా విద్యా ప్రోత్సాహం అభినందనీయమని జోన్ చైర్ పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్నారు. త్వరలో ప్రారంభం కానున్న పదోతరగతి పరీక్షల్లో పట్టణంలోని విద్యార్థులు ఉత్తమమార్కులు సాధించాలని ఆశిస్తూ బుధవారం తాడేపల్లిగూడెం డైమండ్స్ ఆధ్వర్యంలో లయన్ లంకా శ్రీనివాస్ సహకారంతో స్థానిక భవిత కేంద్రంలో వికలాంగ విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన ప్యాడ్, పెన్స్ ప్యాడ్‌ను అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన జోన్ చైర్పర్సన్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ పదం కుమార్ గుప్తా విద్యా ప్రోత్సాహం కింద ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో టాప్ టెన్‌లో ఉన్న విద్యార్థులకు బహుమతులతో పాటు మెడిసిన్ ప్రగతి కాలేజ్ వారి ప్రోత్సాహం రూ.10,116 ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.జ్యోతి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బాధితునికి రోటరీ క్లబ్ సాయం

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని తూర్పుతాళ్లు గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో ఆకుల సత్యనారాయణ ఇల్లు దగ్ధమైంది. బాధితుడు సత్యనారాయణ ఇల్లు నిర్మించుకునేందుకు రోటరీ క్లబ్ వారు రూ.10 వేలు ఆర్థిక సాయం, 30 బస్తాల సిమెంట్ బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ గన్నాబత్తుల సత్యవతి, కోట్ల రామకుమార్, కనకం వరప్రసాద్, బత్తి వరలక్ష్మి పాల్గొన్నారు.

'నియోజకవర్గ అభివృద్ధికి చీఫ్‌విప్ కృషి'

ప్రజాశక్తి - మొగల్తూరు

నరసాపురం నియోజకవర్గాన్ని రూ.కోట్లతో అభివృద్ధి చేసిన ఘనత చీఫ్ విప్ ప్రసాదరాజుకే దక్కుతుందని వైసిపి యూత్ విభాగ మొగల్తూరు మండల శాఖ అధ్యక్షుడు రాజశేఖర్ (బాబి)అన్నారు. మొగల్తూరులో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా వైసిపి ప్రభుత్వం వెలికి తీసిందన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే వైసిపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. నరసాపురం నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ప్రసాదరాజుకు యువత అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యువత కార్యదర్శి పోతుల ఫణి, కోణాల ప్రసాద్, కోడెల వెంకట్రావు, షేక్ బాషా, కడలి నాగార్జున, యన్నాబత్తుల అశోక్ ఉన్నారు.

నరసాపురంలో మసీదు ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో మసీద్-ఎ-పుర్‌నూరు (చిన్న మసీదు) పున:ప్రారంభ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. పాత బజారులో శిథిలావస్థకు చేరిన చిన్న మసీదును నేలమట్టం చేసి ఆధునిక వసతులతో రూ.1.50 కోట్లతో పున:నిర్మించారు. ఆ మసీదును ముదునూరి ప్రసాదరాజు బుధవారం ప్రారంభించారు. శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఎ.షరీఫ్ మాట్లాడారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎలు కొత్తపల్లి జానకిరామ్, బండారు మాధవనాయుడు, టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, కవురు పెద్దిరాజు, కొవ్వలి రామ్మోహన్‌నాయుడు, చాగంటి మురళీకృష్ణ, కొత్తపల్లి నాని, శిరిగినీడి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

మసీదు చుట్టు పక్కల హిందు వ్యాపారులందరూ ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు పుచ్చకాయ ముక్కలు పంపిణీ చేశారు. రూ.30 వేల విలువైన 1500 కేజీల పుచ్చకాయ ముక్కలను పంపిణీ చేశారు.

పారిశుధ్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

పారిశుధ్య సిబ్బంది అంకిత భావంతో పని చేయాలని మున్సిపల్ ఛైర్మన్ వెంకటరమణ అన్నారు. పట్టణంలోని 21వ వార్డు ఎన్‌టిఆర్ కాలనీలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకట రమణ, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ డ్రెయిన్ ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతిరోజు వార్డుల్లో ఫాగింగ్ చేయించాలన్నారు బ్లీచింగ్, సున్నం కలిపి తడిచెత్త తీసిన చోట చల్లించాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. కౌన్సిలర్లు తాడి సునీత, వంగా శ్రీకాంత్ కన్నా, కేసరి గంగరాజు, మల్లడి బుజ్జి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పిచ్చి కుక్క స్వైరవిహారం

12 మందికి గాయాలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో పిచ్చి కుక్క స్వైరవిహారం చేసి 12 మందిని గాయపరిచింది. వీరంతా స్థానిక ఏరియా ఆసుపత్రిలో వ్యాక్సిన్ వేయించుకున్నారు. పట్టణంలోని పీచుపాలెం, పంజాసెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, మెయిన్ రోడ్, బస్టాండ్ సెంటర్‌లో 12 మందిని పిచ్చి కుక్క గాయపరిచింది. దీంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఒక్కసారిగా వచ్చి కరవడంతో ఆందోళనకు గురయ్యారు. ఒకే కుక్క రెండు కిలోమీటర్లు ప్రయాణించి 12 మందిని గాయపరిచింది. వీరిలో ఇద్దరు చిన్నారులు, ఒక వృద్ధుడు, తొమ్మిది మంది పురుషులు ఉన్నారు. వీరంతా స్థానిక ఏరియా ఆసుపత్రికి వెళ్లారు. వారికి ఆసుపత్రి సిబ్బంది వైద్యం చేసి ర్యాబిస్ వ్యాక్సిన్ వేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.సుప్రియ తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు

ఉండి : వివాహితను వరకట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కేసు నమోదైంది. ఉండి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చెరుకువాడ గ్రామానికి చెందిన వాగోలు సుకన్యకు, విస్సాకోడేరుకు చెందిన రమేష్‌కు 2009లో వివాహమైంది. ఆ సమయంలో కట్నంగా రూ.5 లక్షల నగదు, ఆరుకాసుల బంగారం, రూ.50 వేల ఆడపడుచు కట్నం రూపంలో ఇచ్చారన్నారు. ఈ క్రమంలో గత రెండేళ్ల నుంచి రమేష్ మద్యానికి బానిసై డబ్బుల కోసం తనను వేధిస్తున్నాడని, దీనిపై తన అత్త, ఆడపడుచులతో చెప్పగా వారు కూడా భర్త రమేష్‌కి మద్దతు పలికి వేధిస్తున్నారని సుకన్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అభివృద్ధి ప్రదాత...సర్రాజు

నేడు భీమవరంలో ప్రథమ వర్ధంతి సభ

సర్రాజు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - కాళ్ల

రైతు, ప్రజల సమస్యల పరిష్కారానికి పట్టువదలని విక్రమార్కుడిలా కృషి చేసి సాధించుకోవడంలో పాతపాటి సర్రాజు దిట్ట. రైతు, ప్రజల మనిషిగా ప్రేమాభిమానాలు సంపాదించిన సర్రాజు వివిధ పదవులు చేపట్టి సేవా తత్పరునిగా పేరొందారు. కాళ్ల మండలం జక్కరంలో జన్మించిన ఆయన సాధారణ స్థాయి నుంచి ఎంఎల్‌ఎగా ఎదిగారు. టిడిపి కంచుకోటైన ఉండి నియోజకవర్గంలో 2004లో సర్రాజు కాంగ్రెస్ తరపున విజయకేతనం ఎగురవేశారు. నియోజకవర్గంలో రూ.800 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశారు. గ్రామాలను అనుసంధానం చేస్తూ వంతెనలు, రోడ్లు నిర్మించారు. కాళ్లలో బిసి ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్ ఏర్పాటుకు కృషి చేశారు. ఎకరం చేను ఎండకుండా సాగునీరు అందించేలా సర్రాజు నిరంతరం పోరాడుతూనే ఉండేవారు. ఆనాడు ప్రభుత్వం నుండి జిఒ తీసుకొచ్చి ప్రతి నీటి సంఘానికి రూ.ఐదు లక్షల నిధులు తెచ్చి పంట, మురుగు కాలువల అభివృద్ధికి కృషి చేశారు. ఆకివీడు తరహాలో మిగిలిన పెద్ద గ్రామాల్లో తక్కువ ధరకే కుళాయి మంజూరు చేయించారు. ఆకివీడు మండలం కుప్పనపూడి గ్రామ శివారు తాళ్లకోడులో 74 ఎకరాల భూసేకరణ చేశారు. నియోజకవర్గంలో పలు గ్రామాల్లో మొత్తం 150 ఎకరాలకు పైగా భూసేకరణ చేసి పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. శివారు ప్రాంతాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేశారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మరణంతో వైసిపిలో చేరారు. 2014లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా సర్రాజు సేవలందించారు. సర్రాజు ఎంఎల్‌ఎగా పని చేసిన రోజుల్లో పేదవాడు ఇల్లు కట్టుకుంటే రూ.20 వేలు ఆర్థిక సాయం, 20 బస్తాల సిమెంటు, ఇసుక ఉచితంగా అందజేశారు. ఉండిలో 220 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను పూర్తి చేయించారు. పెద్ద చదువులు చదవని సర్రాజు సభల్లో మాట్లాడేందుకు ఇంట్లోనే స్వయంగా ప్రాక్టీస్ చేసేవారు. ఆయన 2023 ఫిబ్రవరి 17న తీవ్ర అస్వస్థతకు గురై కన్నుమూశారు.

నేడు భీమవరంలో ప్రథమ వర్ధంతి సభ

భీమవరం ఆదర్శనగర్‌లో పాతపాటి సర్రాజు స్వగృహం వద్ద ఈ నెల ఏడో తేదీన పాతపాటి సర్రాజు ప్రథమ వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు వారి కుమారులు పాతపాటి వెంకట శ్రీనివాసరాజు, పాతపాటి యుగంధర్‌నాగవర్మ తెలిపారు. సభకు శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, వైసిపి ఎంపీలు, ఎంఎల్‌ఎలు, ప్రముఖులు హాజరవుతారని పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

మండల సమావేశంలో ఎంపిపి దండు వెంకటరామరాజు

మాట్లాడుతున్న ఎంపిపి దండు వెంకటరామరాజు

ప్రజాశక్తి - గణపవరం

రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపిపి దండు వెంకటరామరాజు అధికారులును ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ భవనంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మండలంలో ప్రతి ఎంపిటిసి సభ్యునికి రూ.మూడు లక్షలు అందించామని చెప్పారు. ఆ సొమ్ములతో గ్రామాల్లో పనులు వెంటనే పూర్తి చేసుకోవాలన్నారు. సమావేశానికి మండలాధికారులు పూర్తిస్థాయిలో రాకపోవటంతో ఎంపిడిఒ ఎంఎస్.ప్రభాకరరావు మాట్లాడుతూ మూడునెలలకోసారి జరిగే మండల సమావేశానికి హాజరు కాని అధికారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. వైద్య శాఖ అందించిన ఆరోగ్యశ్రీ కార్డులను వెంటనే ఇకెవైసి చేయించుకోవాలని చెప్పారు. మండలానికి 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరైనట్లు తెలిపారు. మండల వ్యవసాయాధికారి ప్రసాద్ మాట్లాడుతూ రైతులందరికీ ఇకెవైసి పూర్తి చేసినట్లు చెప్పారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ రూబేష్, ఐసిడిఎస్ గణపవరం సూపర్ వైజర్ తులసి గణపవరం పిహెచ్‌సి కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు, ఎంఇఒ పి.శేషు, వల్లూరు సర్పంచి ఎం.వేణు మాట్లాడారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు దేవవరపు సోమలక్ష్మి, వైస్ ఎంపిపి సలాది రత్న దుర్గ కుమారి, సర్పంచులు ఛాంబర్ మండలాధ్యక్షురాలు చనుమూరి లక్ష్మీభవాని పాల్గొన్నారు.

మహిళలకు సమాజంలో సమానత్వం కల్పించాలి

తాడేపల్లిగూడెం : మాట్లాడుతున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సు బంకుర యశోద అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ హాజరై మాట్లాడుతూ మహిళా సాధికారత పేపర్లకే పరిమితం అవుతుందన్నారు. మహిళలకు ఈ సమాజంలో సమానత్వం లేదన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు సమానత్వం సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. నిరంతరం మహిళల సమస్యలు పెరుగుతున్నాయని, పరిష్కారాలు మాత్రం కనపడటం లేదని చెప్పారు. ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా మహిళలకు ఉపయోగకరంగా ఉండటంలేదన్నారు. మహిళల సమస్య పరిష్కార దిశగా ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరపాలని ఆమె కోరారు. మహిళల సాధికారత దిశగా ఏ ప్రభుత్వం ముందుకు సాగుతుందో ఆ ప్రభుత్వానికి మహిళలందరూ సహాయ సహకారాలు అందిస్తారని, మహిళల సమస్యలపై రానున్న ప్రభుత్వాలు నిరంతరం పని చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మీసాల పావని, దాసరి వెంకటలక్ష్మి, శ్యామల దుర్గ పాల్గొన్నారు.

8న మహిళా ఉద్యోగులకు సన్మానం

నరసాపురం : ఈ నెల ఎనిమిదో తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం పురపాలకం సంఘంలో మహిళ నాయకులు, ఉద్యోగులకు సన్మానం చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం కౌన్సిల్ హాలులో ఉదయం 11 గంటలకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్, మహిళా కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లకు సన్మాన కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. పురపాలక సంఘంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ఉత్తమ విధి నిర్వహణకు సన్మానించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

భీమవరం రూరల్ : నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అడ్డుకోవాలంటే ప్రతిమహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అనిలాకుమారి అన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బుధవారం భీమవరం మండలంలోని చినఅమిరం, రాయలం గ్రామాల్లో మహిళా చట్టాలపై అంగన్వాడీ టీచర్స్ అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా అనిలాకుమారి మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ మహిళలు విజయాలు సాధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం ప్రాజెక్టు లీడర్ సిహెచ్.మహాలక్ష్మి, దమయంతి, వెంకటలక్ష్మి, సాయి కుమారి పాల్గొన్నారు.

బాధితులకు చీఫ్ విప్ పరామర్శ

ప్రజాశక్తి - నరసాపురం

ఇటీవల కాలంలో పలు అనారోగ్య కారణాల రీత్యా మృతి చెందిన మండలంలోని ఎల్‌బిచర్ల గ్రామానికి చెందిన గుబ్బల ఆంజనేయులు, జెల్లి రాంబాబు, పోతాబత్తుల దక్షిణామూర్తి, కొయ్యే రాజారావు కుటుంబ సభ్యులను ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పరామర్శించారు. అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందిన పట్టణంలోని ఐదో వార్డుకు చెందిన వల్లభుని అనురాధ మృతదేహానికి నివాళులర్పించి ఆమె కుటుంబీకులను ప్రసాదరాజు పరామర్శించారు.

పార్క్ అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని కాటన్ పార్క్ అభివృద్ధి పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. రూ.1.38 కోట్లతో జరుగుతున్న పార్క్ అభివృద్ధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు పార్కును పూర్తి స్థాయిలో తొందరలోనే అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

'కొవ్వలికి ఎంఎల్‌ఎ టిక్కెట్ ఇవ్వాలి'

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం నియోజకవర్గ ఎంఎల్‌ఎగా అన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు వైపు చూస్తున్నారని మండల సర్పంచుల ఛాంబర్ మాజీ అధ్యక్షుడు, యర్రంశెట్టివారిపాలెం మాజీ సర్పంచి కూనపురెడ్డి వీర వెంకట విజయ రంగారావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నరసాపురంలో తెలగ కళ్యాణ మండపం అభివృద్ధి నిమిత్తం రూ.1.50 కోట్లు సాయం చేశారన్నారు. జాబ్ మేళా పెట్టి అనేకమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. అనేక దేవాలయాల నిర్మాణానికి ధన సహాయం చేశారన్నారు. అనారోగ్యపాలైన అనేకమంది పేదలకు ఆర్థిక సాయం అందించారన్నారు. అనేకమందిని ఆర్థికంగా ఆదుకుంటున్న కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు వైపు అందరి చూపు ఉందని, ఆయనకు ఎంఎల్‌ఎ టికెట్ ఇచ్చి గెలిపించాలని రంగారావు కోరారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ఎంఇఒ వి.హనుమ సతీమణి పద్మశ్రీ మొదటి వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం అరుగొలను మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు రూ.7500లతో భోజనం ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు ఎంఇఒ హనుమకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీనివాస్, నవాబుపాలెం ప్రధానోపాధ్యాయులు ఎం.పుష్పరాజు, కమిటీ ఛైర్మన్ ప్రసన్న, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

తూర్పుతాళ్లులో 'జనంలోకి జనసేన'

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని తూర్పుతాళ్లు గ్రామం కరింశెట్టిపాలెం (పిండి వారి సెంటర్) నుంచి తూర్పుతాళ్లు సెంటర్ వరకు బుధవారం "జనంలోకి జనసేన" కార్యక్రమం నిర్వహించారు. జనసేన నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో టిడిపి, జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జక్కం బాబ్జి, వర్ధనపు ప్రసాద్, ఆకన చంద్రశేఖర్, వలవల మురళి, రావూరి చిరంజీవి పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధే వైసిపి లక్ష్యం

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు

దొడ్డనపూడిలో ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న పివిఎల్

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామాలాభివృద్ధే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని జక్కరం, లక్ష్మీనరసింహ పురం, గాంధీనగరం, దొడ్డనపూడి, సూర్యారావుపేట గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. జక్కరంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. ఎల్‌ఎన్.పురంలో జల జీవన్ మిషన్ పథకం ద్వారా సుమారు రూ.11.70 లక్షలతో నిర్మించిన పది వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. కాళ్ల గ్రామ సచివాలయం పరిధిలో గాంధీనగరంలో ఎన్‌ఆర్‌జిఎస్ సహాయ నిధులు సుమారు రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, జిల్లా ప్రజా పరిషత్ సహాయ నిధులు సుమారు రూ. 10 లక్షలతో జిఎస్‌బి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. దొడ్డనపూడిలో జల జీవన్ మిషన్ నిధులు సుమారు రూ.70.70 లక్షలతో నిర్మించిన 60 వేల లీటర్ల సామర్థ్యం గల రెండు వాటర్ ట్యాంకులను ప్రారంభించారు. కోమటిగుంట గ్రామ పరిధిలో సూర్యారావుపేటలో జల జీవన్ మిషన్ నిధులు సుమారు రూ.38.48 లక్షలతో నిర్మించిన 40 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్, పాలకొల్లు నియోజవర్గ పరిశీలకులు పాతపాటి శ్రీనివాసరాజు, ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాధరాజు, జెడ్‌పిటిసి సభ్యులు సోమేశ్వరరావు, గ్రామ సర్పంచులు కూచంపూడి పద్మావతి, తానింకి నాగరాజు, బోణం భాగ్యశ్రీ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాల్లో గందరగోళం

ఎగ్జిబిషన్‌కు అనుమతుల్లేవని కోర్టుకెళ్లిన స్థానికులు

ప్రజాశక్తి - ఆచంట

శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆచంట రామేశ్వర స్వామి కళ్యాణ మండపం వెనకవైపు ఖాళీ స్థలంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహించేందుకు ఆలయం తరుపున టెండర్ నోటీసు వేయగా రూ.17.70 లక్షలకు ఆసామి దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు అనుమతులు లేవని, అక్కడ నిర్వహిస్తే ఏదైనా ప్రమాదం జరగొవచ్చని, టెండర్ కూడా రూ.ఆరు లక్షలకే వేశారని స్థానికులు కోర్టుకెళ్లారు. ఈ నేపథ్యంలో శివరాత్రి ఉత్సవాల్లో గందరగోళం నెలకొంది. గతంలో ఈ ఎగ్జిబిషన్‌లో ఆచంట తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లే ఓ ప్రయివేట్ లే అవుట్‌లో ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు ఆ లే అవుట్ యజమాని కాదని, ఆలయం తరుపున టెండర్ వేసి అత్యధిక రేటుకు దక్కించుకున్నారు. ఈ క్రమంలో ప్రారంభ దశలోనే ఆటంకం ఎదురైంది.

ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రకుమార్‌ను వివరణ కోరగా రామేశ్వర స్వామి ఆలయం తరపున టెండర్ ప్రకటించామని, ముందుగా కాకినాడకు చెందిన ఓ ఆ సామి రూ.19 లక్షలకు టెండర్ దక్కించుకోగా, రూ.25 వేలు అడ్వాన్స్ ఇచ్చి వెళ్లిపోయారని, అనంతరం ఆ సామికి ఫోన్ చేసి మిగిలిన సొమ్ము కట్టాలని అడగగా సమాధానం చెప్పకపోవడంతో తిరిగి మరోసారి టెండర్ వేశామని తెలిపారు. రెండోసారి రూ.17.70 లక్షలకు ఎగ్జిబిషన్ యజమాని టెండర్ దక్కించుకుని ఏర్పాట్లు చేసుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో స్థానికులు కోర్టుకెళ్లారన్నారు.

కాపవరంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కాపవరంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచి కోలాటి రాధ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలను ప్రతిఒక్కరు వినియోగించుకోవాలన్నారు. 302 మందికి పరీక్షలు చేశారు. 11 మందిని కంటి ఆపరేషన్‌కి రిఫర్ చేశారు. 26 మందికి కళ్లజోళ్లు అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు అడ్డాల ప్రతాప్ కుమార్, డాక్టర్ జి.సుష్మ, డాక్టర్ సంతోష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి డి.శ్రీనివాస్, ఆరోగ్యవిస్తరణాధికారి గుడాల హరిబాబు, పంచాయతీ కార్యదర్శి డి.శ్రీనివాస్, పిహెచ్‌ఎన్‌పి ఎలిజిబెత్, డి.కమల, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సత్యవేణి, సచివాలయ కార్యదర్శి సిహెచ్.మధుబాబు, మహిళా పోలీస్ కె.శశిరేఖ పాల్గొన్నారు.

శ్రీ కోర్టు వారి పత్రికా ప్రకటన

In the Court of the Principal Jr Civil Judge Tanuku
O.S.No.322/22

Between :
UBI (Erstwhile Andhra Bank) Rep by its Sr Manager Relangi Branch ...Plaintiff
And
1. Vemula Krishna, S/o Venkata Ratnam, D.No.21-6-7, Yedla Bazar, W.No.14, Palakollu (M), W.G.Dist, AP.
2.Vemula Vardhana Rao, S/o Chiranjeevi, Door. No.4-105, Gaggiparru (V), Kontheru (P), Yelamanchili (M), W.G.Dist ...Defendents

పై నంబరు గ్రంధంలో వాది మీ పై బ్యాంక్ లోను రికవరీ నిమిత్తం పై దావా చేసినారని అందులో ప్రతివాదులయిన మీరు అనేక సార్లు శ్రీ కోర్టు వారు మీకు కోర్టు ద్వారాను, తపాల ద్వారాను మీకు పంపించిన దావా సమన్లు మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకోకుండా కాలయాపన చేసిన కారణంగా సదరు శ్రీకోర్టు వారు యిందు మూలముగా సదరు దావా సమన్లను యీ పత్రికా ప్రకటన ద్వారా దావా సమన్లు ఆర్డరు చేసినందున సదరు ఈ ప్రకటన వేసిన నాటినుండి 30 రోజులలో మీరు వ్యక్తిగతముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం 10.30 గంటలకు హాజరు కావలెనని, లేనిచో పై నెంబరు గ్రంధంలో మీకు పరోక్షముగా శ్రీకోర్టువారు ఆర్డరు చేయుదురనియిందుమూలముగా తెలియపరచడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాది తరపు అడ్వకేట్
E.S.V.B.Madhavi
Panel Advocate, Bhimavaram.

పాస్‌పోర్టు పోయినది

GODI PINKEY అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.23-02-2007న G1195116 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరుచేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది.28-02-2024 మా ఇంటి నుండి నరసాపురం టౌన్, మెయిన్‌రోడ్డుకు వెళ్లునప్పుడు నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

GODI PINKEY
W/o. Godi Sridhar
D.No. 8-20, Pedapeta, Kopparru Post
Narasapuram Mandal, W.G.Dt. A.P.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 376/2023

బిట్వీన్:
కొప్పుల శ్రీనివాసు -వాది
మరియు
మణిపూరి సత్యనారాయణ -ప్రతివాది

ప్రతివాది:
మణిపూరి సత్యనారాయణ, S/o. రాము, డోరు నెం. 9-2-41, శివాలయం వీధి, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ, ప॥గో॥జిల్లా - 534101, సెల్: 9494343886.

పై నెంబరు గ్రంథంలో శ్రీ కోర్టు ద్వారా ప్రతివాదికి సమన్లు పంపించినప్పటికి అవి తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వులు ప్రకారం **ది. 12-03-2024వ తేదీన ఉదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలుపవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

అద్దంకి విజయరత్నం
తాడేపల్లిగూడెం అడ్వకేట్, తాడేపల్లిగూడెం
ది.6-3-2024 సెల్: 9290188928

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 375/2023

బిట్వీన్:
అంకం రమణ -వాది
మరియు
మణిపూరి మాణిక్యం -ప్రతివాది

ప్రతివాది:
మణిపూరి మాణిక్యం, W/o. సత్యనారాయణ, డోరు నెం. 9-2-41, శివాలయం వీధి, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ, ప॥గో॥జిల్లా - 534101, సెల్: 9494343886.

పై నెంబరు గ్రంథంలో శ్రీ కోర్టు ద్వారా ప్రతివాదికి సమన్లు పంపించినప్పటికి అవి తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వులు ప్రకారం **ది. 29-04-2024వ తేదీన ఉదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలుపవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

అద్దంకి విజయరత్నం
తాడేపల్లిగూడెం అడ్వకేట్, తాడేపల్లిగూడెం
ది.6-3-2024 సెల్: 9290188928

IN THE COURT OF THE ADDITIONAL CIVIL JUDGE [SENIOR DIVISION] ELURU
E.P.NO.24/2023
O.S.NO.437/2015

Between:
Surattu Srinivasa Rao ..*Decree-Holder*
VS
Puli Gopala Rao
...*JUDGEMENT-DEBTOR*

AUCTION PUBLIATION

WHERE AS the DHR obtained decree against the JDR above named and brought the below mentioned EP schedule property to sale in the above Execution petition.

WHERE AS the Honourable IN THE COURT OF THE ADDITIONAL CIVIL JUDGE [SEINOR DIVISION] ELURU fixed the date on 27..03..24 for the sale of the schedule property by public auction in the court, by ordering publication of the sale for notice to the intending bidders in order to participate in the auction.

TAKE NOTICE that the persons who intended to participate in the auction for purchase of the schedule mentioned property can appear before the Honurable court **on 27-03-2024 at 10-30 AM** on words and participate in auction. The intended bidders are also brought Adhar cards and produce the same at the time of participating the Auction.

SCHEDULE

West Godavari District, Jalipudi Village, Eluru Mandal, Eluru Sub-Registry, D.No.1-127C Three Danyapukottu situated in an extent of 54 square yards in R.S.No.60 bounded by:
EAST: Surattu Jagan Vijayalakshmi gari Rakapokala Dari. **SOUTH:** Property belongs to Puli Suryanarayana. **WEST:** Puli Surayanarayana gari sandu Dari. **NORTH:** joint Nadaka Dari.

Within the said boundaries Three Danyapukottu situated in an extent of 54 square yards with all easementary rights.

DHR value Rs. 2,00,000/-
Amine Value Rs. 5,40,000/-
JDR Value -Nil-

DEVULAPALLI SREE RAM
Eluru, **D.KRISHNA SASTRY**
Dt. 01-03-2024 Advocates for DHR

TADEPALLIGUDEM MUNICIPALITY
E-PROCUREMENT TENDER NOTICE

Roc. No.2422/E1/2023-24 **Dated.06-03-2024**

Sl. No.	Name of the Work	Name of the Grant	Estimate Value (Rs. in Lakhs)	Bid Downloading Start Date	Last Date for Receipt of Bids
1	Civil, Water supply and Electrical works-3 Nos 3	General Funds	48.30	07-03-2024	11-03-2024

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit web site http://tender.apeprocurement.gov.in

Sd/- **COMMISSIONER**
TADEPALLIGUDEM MUNICIPALITY